## క్లుప్తంగా

### రైతులకు రైతు భరోసా, సున్నావడ్డీ జమ

**నకరికల్లు:** మండలంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన, వైఎస్సార్ సున్నావడ్డీ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన, వైఎస్సార్ సున్నావడ్డీ పథకాల ద్వారా 594మంది కౌలు రైతులకు వారి ఖాతాల్లో రూ.13,74,000, దేవదాయ భూముల్లో కౌలు సాగు చేస్తున్న నలుగురు రైతులకు రూ.9,300, అటవీభూముల్లో పట్టాలు పొంది సాగుచేసుకుంటున్న 221మంది రైతులకు రూ.4,92,000 పీఎం కిసాన్ భూ యజమానులు 10,444 మంది రైతులకు రూ.2.09కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రబీ 2021–22 ఏడాది గాను వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా 979 మంది రైతులకు రూ.27,20,000, ఖరీఫ్ 2022కుగాను 695 మంది రైతులకు రూ.19,50,000 జమ కానున్నట్లు తెలిపారు. రూ.1లక్ష పంట రుణం పొంది ఏడాదిలోపు చెల్లించిన రైతులందరికీ సున్నావడ్డీ వర్తించడంతో చెల్లించిన వడ్డీని రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో స్వామి వార్ల కల్యాణ మహోత్సవం



**మిట్టగుడిపాడు(రెంటచింతల):** మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల సందర్భంగా శివాలయంలో శివపార్వతుల కల్యాణమహోత్సవం, వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి 19వ వార్షిక శాంతి కల్యాణ వేడుకలు, గురువారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయాల ప్రధాన అర్చకులు నాగేశ్వర శర్మ, రమణాచార్యులు నేతృత్వంలో పలువురు వేదపండితులు వేకువ జాము నుంచి ఆయా ఆలయాలలో పలు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో హోమాలు, పంచామృతాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శివాలయంలో పలువురు దంపతులు స్వామి వార్లకు కల్యాణం జరిపించారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో నెవలిరెడ్డి, ఆలయాల కమిటీ చైర్మన్లు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### 3న ఉచిత కంటి వైద్య శిబిరం

**దాచేపల్లి :** నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 3న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు నాగెండ్ల సుమతీరత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 9966045613 నెంబర్‌ని సంప్రదించాలని ఆయన కోరారు.

### ఘనంగా ఆలయ పునఃప్రతిష్ట వేడుకలు



**శావల్యాపురం:** కారుమంచి గ్రామంలోని సీతారామ స్వామి ఆలయం పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మించిన దేవాలయ ప్రతిష్ఠా వేడుకలు బాలకృష్ణామాచార్యుల సారథ్యంలో అర్చకులు కొడవటికంటి కృష్ణమాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆదిత్య కుమార్ నిర్వహించారు. దాదాపు ఎనిమిది వేల మందికి అన్న సంతర్పణ చేశారు. సీతారామ స్వాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి తనయుడు గిరిబాబు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, వివిధ గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.

### ఘనంగా గీతాంజలి పాఠశాల వార్షికోత్సవం

**వినుకొండ(నూజెండ్ల) :** స్థానిక గీతాంజలి మెయిన్ క్యాంపస్ 23వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దాహార్తి దరిచేరకుండా..

- ప్రజల దాహార్తిని తీర్చే జలజీవన్ మిషన్
- పెదకూరపాడు నియోజకవర్గంలో తీరనున్న తాగునీటి కష్టాలు
- మొదటి విడతలో రూ.55.79 కోట్లతో పనులు
- రెండో విడతలో రూ.25.43 కోట్లు విడుదల
- ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా
- జగనన్న కాలనీల్లో కూడా..
- భగీరథ ప్రయత్నంతో ఎమ్మెల్యే నంబూరు కృషి



పరస గ్రామంలో జలజీవన్ మిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు(పాత చిత్రం)



పరస గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్




**పెదకూరపాడు:** గతంలో తాగేందుకు గుక్కెడు నీటి కోసం అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. కిలోమీటర్ల మేరకు నడిచి వ్యవసాయ బావులు, బోర్ల దగ్గర తాగునీటిని తెచ్చుకునేవారు. జలజీవన్ మిషన్ పథకంతో ఈ కన్నీటి కష్టాలకు పరిష్కారం దొరికింది. నియోజకవర్గంలోని 107 గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.55.79 కోట్ల నిధులు విడుదల చేశాయి. 2020 నుంచి 2025లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే పలు గ్రామాల్లో పైపులైన్ పనులు జరుగుతున్నాయి.



జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కొళాయి ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళ

మరికొన్ని గ్రామాల్లో తాగునీరు కొళాయిల ద్వారా సరఫరా అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో.. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక చొరవ తీసుకుని పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని తాపత్రయ పడుతున్నారు.

**నియోజకవర్గంలో మొదటి విడతలో జలజీవన్ మిషన్ నిధుల మంజూరు..(రూ.కోట్లలో)**

| మండలం | గ్రామాలు | గృహాలు | నిధుల మంజూరు |
| --- | --- | --- | --- |
| పెదకూరపాడు | 20 | 12,319 | 11.10 |
| అమరావతి | 23 | 6,690 | 7.94 |
| క్రోసూరు | 19 | 15,129 | 16.86 |
| బెల్లంకొండ | 13 | 7,808 | 9.68 |
| అచ్చంపేట | 33 | 10,976 | 10.21 |
| మొత్తం | 108 | 52,922 | 55.79 |

**జగనన్న కాలనీల్లోనూ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లోనూ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారు. పెదకూరపాడు మండలంలో పాటిబండ్ల, జలాల్‌పురం, కంభంపాడు, పరస, పొడపాడు, లగడపాడు గ్రామాల్లో రూ.50 లక్షల నిధులతో పైపులైన్లు ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేస్తున్నారు.

**రూ.81.22కోట్లు విడుదల**

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పెదకూరపాడు నియోజకవర్గంలో మొదటి విడగతగా మొత్తం 87 గ్రామ పంచాయతీలకు గాను 108 గ్రామాలకు రూ.55.79 కోట్లు, రెండో విడతగా రూ.25.43 కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.81.22 కోట్ల నిధులను విడుదల చేశారు. మొదటి విడతలో మంజూరు అయిన నిధులతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

**తాగునీటికష్టాలు తీరాయి**



గతంలో తాగునీటి కోసం కష్టాలు పడ్డాం. ప్రభుత్వం మా ఇంటికి ఉచితంగా కొళాయి ఇచ్చింది. ప్రస్తుతం ప్రతి రోజు నీళ్లు వస్తున్నాయి. ఇన్నాళ్లకు మాకు తాగునీటి కష్టాలు తీరాయి.
– కంతేటి శౌరీలు, పరస

**ఇంటింటికి కొళాయి హర్షణీయం**



గతంలో తాగునీటి కోసం వ్యవసాయ పొలంలోని నేల బావులను ఆశ్రయించేవాళ్లం. ఇప్పుడు మా ఇంటికి కొళాయి ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీల్లో కూడా పైపులైన్లు వేశారు. దీంతో ఇబ్బందులు తొలగాయి.
–వెలితోటి శ్రీలక్ష్మి, పొడపాడు

**ప్రతి ఇంటికి తాగునీరు మా లక్ష్యం**



జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీరు అందిస్తున్నాం. రెండు విడతల్లో మొత్తం రూ.81.22 కొట్లు నిధులు మంజూరు అయ్యాయి. పైపులైన్ల పనులు పూర్తి అయ్యాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే మా లక్ష్యం.
– నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే, పెదకూరపాడు

### నేడు కొమెరపూడిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, బీటీ రోడ్, కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీ నందిగం సురేష్ శుక్రవారం హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి గురువారం కోరారు. కొమెరపూడి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు. కొమెరపూడి–యర్రగుంటపాడు బీటీ రోడ్డు శంకుస్థాపన, బీసీ కాలనీలో రజకుల కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. ముందుగా గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు, అనంతరం బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారన్నారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేత

**పిడుగురాళ్ల:** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి హాజరై అందించారు. ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైద్యశాలలో పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం మండలాల్లోని టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని పవర్ గ్రిడ్ సంస్థ వారి సహాయ సహకారాలతో అందించారు. వైద్యాధికారిణి డాక్టర్ ప్రభావతి, టీబీ డిపార్టుమెంట్ సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ విజిటర్ అర్జున్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రవి పాల్గొన్నారు.

## పల్స్ పోలియోపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ రమాదేవి

**క్రోసూరు:** భారత్‌ను పోలియో రహిత దేశంగా చేయడానికి కృషి చేద్దామని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీవీఎస్ రమాదేవి అన్నారు. మార్చి 3వ తేదీన జరుగనున్న పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా వ్యాక్సినేటర్లకు, ఆరోగ్య సిబ్బందికి గురువారం క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ డీవీఎస్ రమాదేవి నేతృత్వంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు పల్స్ పోలియో కార్యక్రమంలో పాటించాల్సిన ముఖ్య విషయాలను ఆమె వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల అధ్యక్షులు పెరుమాళ్ళ కోటయ్య పాల్గొన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయటానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి రమాదేవి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు కచ్చితంగా వేయించాలన్నారు. 15 సచివాలయాల పరిధిలో 4,722 మంది చిన్నారులకు చుక్కల మందు వేయడమే లక్ష్యమని చెప్పారు. ఆదివారం పల్స్ పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయాలని తరువాత సోమవారం, మంగళవారం ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. పిల్లలకు చుక్కలు వేశాక ఎడమ చేయి చిటికెన వేలికి మార్క్ పెట్టాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బూతులలో పోలియో చుక్కలు వేయాలన్నారు. మండల పరిధిలో 25 పల్స్ పోలియో బూత్‌లు, రెండు మొబైల్ టీంలు, ఒక ట్రాన్సిట్ టీం, ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని తెలియజేశారు. వేరే ప్రాంతం నుంచి వివిధ పనులకు క్రోసూరు మండలానికి వచ్చిన కూలీల పిల్లలకు మొబైల్ టీం ద్వారా పోలియో చుక్కలు వేయటం జరుగుతుందని అదనపు వైద్యురాలు డాక్టర్ బాల అంకమ్మబాయి తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు కూడా పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ సాద్ అన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఫార్మేట్లను ఏ విధంగా పూర్తి చేయాలో వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి అధికారికి సత్కారం



మండల అభివృద్ధి అధికారిని సత్కరిస్తున్న ఎంపీపీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఉద్యోగులు

**రాజుపాలెం:** విధి నిర్వహణలో మండలాన్ని అభివృద్ధి చేయడంలో అహర్నిశలు కృషి చేసి తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు కొనియాడారు. మండలంలో ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన తలుపుల శ్రీనివాసరావును ఉద్యోగస్తులు, ప్రజాప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాట్లాడుతూ శ్రీనివాసరావు మండల అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా, అన్ని గ్రామ సచివాలయ సిబ్బందిని, ప్రజాప్రతినిధులను, సమన్వయం చేసుకుని తనదైన శైలిలో పరిపాలన చేశారు. వృత్తిలో ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. పల్నాడు జిల్లా డ్వామా పీడీ జోసఫ్ మాట్లాడుతూ పదవీ విరమణ తరువాత శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని చెప్పారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావు దంపతులను అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బంధువులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, జీడీసీఎంఎస్ పాలువాయి ఆదినారాయణ, ఎంఈవో మల్లిఖార్జున శర్మ, పంచాయతీరాజ్ డీఈ శరత్‌బాబు, ఎంపీడీవోలు బండి శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, తహసీల్దారు హరిబాబు, ఏవో వెంకటనర్సయ్య, ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మనాగేశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



**పెదకూరపాడు:** మండల పరిధిలోని కాసిపాడు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు బుధవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికి పార్టీ, తాను అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా తాను ఉన్నానని గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారిలో మహేష్, చిట్టిబాబు ఉన్నారు.

### వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



**బెల్లంకొండ:** మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాల పార్టీ నాయకులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి సమావేశం నిర్వహించారు. అనంతరం పాపాయపాలెంకు చెందిన టీడీపీ నాయకులు వసంతకుమారి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఓర్సు మధు, గోపీకృష్ణలకు కండువాలు కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేసిన అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, పాపాయపాలెం సర్పంచ్ చిమటా మాధవి వెంకట సైదయ్య, మర్రి ప్రసాదరెడ్డి తదితరులున్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



ముప్పాళ్ళలో ఎంఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

**ముప్పాళ్ళ:** ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తే సమాజం నుంచి మన్ననలు లభిస్తాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి ఒంగోలు రాజు పదవీవిరమణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని చెప్పారు. వృత్తి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తుల్లో ఒంగోలు రాజు ఒకరని అన్నారు. చేపట్టిన బాధ్యతల పట్ల ఎలాంటి ఆరోపణలు లేకుండా వృత్తి ధర్మం పాటిస్తూ పదవీ విరమణ చేయటం అభినందనీయమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించే సౌకర్యాలను అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద వర్గాల వారే అధికంగా ఉంటారని, అలాంటి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులే అన్నారు. ముందుగా ఎంఈవో ఒంగోలు రాజు, పుష్పహేమలత దంపతులను ముప్పాళ్ళ నుంచి ఎంఈవో కార్యాలయం వరకు గుర్రపు బండిపై ఊరేగించారు. అనంతరం ఎంఈవో దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎంఈవోలు ఆదినారాయణ (గుంటూరు రూరల్), శ్రీనివాసరావు (సత్తెనపల్లి), ఏసుబాబు(నరసరావుపేట), రాజానగరం ఎంపీడీవో జ్యోతిర్మయి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రెంటచింతలలో దొంగల హల్‌చల్

**రెంటచింతల:** మండల కేంద్రం రెంటచింతలలో గురువారం తెల్లవారు జామున ఇద్దరు దొంగలు హల్‌చల్ చేశారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన దాని ప్రకారం గ్రామంలోని బ్రహ్మయ్య బావి సెంటర్‌లో తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో మెడికల్ షాపు, దాని ఎదురుగా ఉన్న స్టీలు సామాను షాపుల తాళాలు గడ్డపారతో పగులగొట్టారు. స్టీల్‌సామాను షాపులో రైస్‌కుక్కర్ అపహరించి, మెడికల్ షాపులో నగదు దొరకకపోవడంతో ఆలయాల సెంటర్‌కు వెళ్లారు. శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలలో హుండీలను పగులగొట్టి నగదు చోరీకి పాల్పడ్డారు. రెండు హుండీలలో సుమారు రూ.35 వేల వరకు నగదు ఉంటుందని అర్చకులు తెలిపారు. స్థానిక రేగులమాణ్యం కాలనీలో కూడా చోరీకి యత్నించగా కాలనీవారు వెంబడించగా పాలువాయిజంక్షన్ వైపు పరారయ్యారు. ఆలయాలలో చోరీ జరిగినట్లు శివాలయం చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కె.వెంకట నారాయణరెడ్డి ఘటన స్థలాలకు చేరుకుని పరిశీలించి వివరాలను సేకరించారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

## టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం

**చిలకలూరిపేట:** జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎంజీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్స్ విభాగంలో టి.జాన్ ఫ్రెడ్డీపాల్, బి.ఇందూలక్ష్మి శారద, మొహమ్మద్ ఆతిఫ్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో ఎం.వర్షిత్‌బాలాజి, బి.అమిత్ డెన్నీ విన్నుస్, వి.చంద్రిక బహుమతులు సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో షేక్ తౌసిఫన్ రెహమాన్, పి.అక్షయ్‌కిరణ్, సీహెచ్ మోక్షిత్ తేజ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.లక్ష్మి, రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు అంకమ్మచౌదరి, సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, తోటకూర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ తోటకూర వెంకటనారాయణ, ఏఎంజీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం పాల్గొన్నారు.

**టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ**



**నాదెండ్ల:** చిలకలూరిపేట ఏఎంజీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో గణపవరం విద్యార్థిని షేక్ ఆఫ్రీన్ సత్తా చాటింది. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు ఐదో తరగతి చదువుతున్న ఆఫ్రీన్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఏఎంజీ యాజమాన్యం సర్టిఫికెట్‌తో పాటూ జ్ఞాపికను ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గాజుల భాను శివసుందరం, ఉపాధ్యాయులు అభినందించారు.

## బాల్య వివాహాల నివారణపై అవగాహన



ఏనుగుపాలెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

**వినుకొండ(నూజెండ్ల):** ఏనుగుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాల్య వివాహాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, నాగరాజు కుమారి, శేషకుమారి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చట్టాలు తదితర అంశాలను వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలీషా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నూజెండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వీరభద్రాచారి, సూపర్‌వైజర్లు విన్యాసమ్మ, నాగరాజుకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు వృత్తి విద్యలపై అవగాహన



**నకరికల్లు:** తరగతి విద్యతో పాటు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని ప్రిన్సిపల్ లక్ష్మి అన్నారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా గురువారం చిలకలూరిపేట సమీపంలోని స్పిన్నింగ్ మిల్లు సందర్శింపజేశారు. దూది నుంచి దారం తయారు చేసే పరికరాలను, తయారీ విధానాన్ని విద్యార్థినులకు ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్, ఒకేషనల్ అడ్వయిజర్‌లను ప్రభుత్వం నియమించిందన్నారు. విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యలపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ కె.మల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.